# ఆర్టిస్ట్

'మేనక్ బార్ అండ్ రెస్టారెంట్' మేనేజరు రూములోంచి బయటికొచ్చిన రాంబ్రహ్మం చాలా ఉత్సాహంగా వున్నాడు.

జేబులోని నోట్లు అతడ్ని నేలమీద నడవనీయడం లేదు.

అవును మరి, చాన్నాళ్ళ తర్వాత గొప్ప ఆర్డర్ వచ్చిందతడికి.

అతడో కమ్మర్షియల్ ఆర్టిస్టు. పోర్ట్రెయిట్స్ రాయటంలో ఆ ప్రాంతంలో అతడికి మంచి పేరుంది. ఇదివరకెక్కువగా అవే రాసేవాడు. అవి బాగా సంపాదించి పెట్టేవి కూడా. కాని కలర్ ఫోటోల శకం ప్రారంభం కావడంతో అతడి కుంచెకి పని తగ్గింది.

ఆదాయమూ తగ్గింది దాంతో ఇతర పెయింటిగ్సూ వివిధ రకాల దృశ్య చిత్రాలూ గీస్తున్నా డీమధ్య.

వాటికైనా తిరిగితే తప్ప ఆర్డర్లు లభించడం లేదు.

అటువంటి సమయంలో మేనక బార్ మేనేజర్ అతడ్ని పిలిచాడు. పిలవడమే కాదు బార్లో పెట్టడానిగ్గాను నిలువెత్తు చిత్రాలకి ఆర్డరిచ్చి ఎడ్వాన్స్ కూడా ఇచ్చాడు.

రోజూ వెళ్ళే చిన్న బ్రాందీషాపు కమ్ బార్ కెళ్ళి చీకటిగా వున్నచోట కూర్చున్నాడు.

వెయిటర్ వచ్చాడు. క్వార్టరు బ్రాందీ, వేపిన జీడిపప్పూ తెమ్మన్నాడు. 'ఇతడు రాంబ్రహ్మమేనా' అనుకుని కించిత్తు ఆశ్చర్యంగా చూసి వెళ్ళిపోయాడతడు.

అతడ్ని పట్టించుకోలేదతడు. సిగరెట్ వెలిగించి కుర్చీకి జేరబడ్డాడు.

అతడి నోట్లోంచి రింగులు రింగులుగా వస్తోంది పొగ. మెదళ్ళో ఎన్నెన్నో ఆలోచనలు సుళ్ళు తిరుగుతున్నాయ్.

ఎలాటి చిత్రాలు గీయాలి? ఎలాటెలాటివి?

బార్ మేనేజర్ని తృప్తిపర్చేలా వుండాలి. తనకి మరిన్ని ఆర్డర్లు తెచ్చి పెట్టేవిగా వుండాలి.

మరికొన్ని క్షణాలకే ఎలాటి అన్న ప్రశ్నలోంచి ఏ దృశ్యం, ఏ యాంగిలు అన్న మీమాంసలో పడ్డాడు రాంబ్రహ్మం.

* * *

"లలిత ఎవరు?" బోటనీ డిమాన్‌స్ట్రేటర్ ప్రశ్నకి ప్రాక్టికల్స్ చేస్తోన్న లలిత సన్నగా కంపిస్తూ లేచి నిలబడింది.

"నువ్వు బొమ్మలు చాలా బాగా వేశావే"

"ఆమె ప్రముఖ ఆర్టిస్ట్ రాంబ్రహ్మంగారమ్మాయండీ" గొప్పగా చెప్పేడు భాస్కర్.

ఆమె అతడివంక అభినందన పూర్వకంగా చూసి తల దించుకుంది చిన్నగా నవ్వి.

"ఐ సీ"

ప్రాక్టికల్స్ అయ్యాయి. అంతా లేబ్ నుండి బయటపడి ఇంటిముఖం పట్టారు.

లలిత వెనుక నడుస్తున్నాడు భాస్కర్.

ఇద్దరూ జూనియర్ ఇంటర్ స్టూడెంట్లే. ఇప్పుడిప్పుడే ఇద్దర్లోనూ యౌవనం పురి విప్పుతోంది. ఆమెతో మాట్లాడాలనీ పరిచయం పెంచుకోవాలనీ గొప్ప ఉబలాటంగా ఉత్సాహంగా వుందతడికి.

కాలేజీలో అడుగుపెట్టిన ఉత్తరక్షణాన్నుంచీ తనెంతో పెద్దదైపోయినట్టూ సినిమాల్లోని నాయికకీ తనకీ భేదం తక్కువ వున్నట్టూ భావిస్తోన్న ఆమె కళ్ళకతడు హీరోలా కన్పించడమే కాదు ఊరిస్తున్నాడు. ఊహల పల్లకీ ఎక్కిస్తున్నాడు.

"నిజంగా మీ బొమ్మలు చాలా బావుంటాయి. ఆఫ్‌కోర్స్. మీ బొమ్మకన్నా కాదనుకోండి"

మొదట అర్థంకాలేదు. అర్థమయ్యేక పులకించిపోయిందామె. తన అందాన్ని పొగిడే మగవాడంటే ఇష్టపడని ఆడవాళ్ళెవరుంటారు గనుక.

"నాకోసారి మీ ఇంటికి రావాలనుంది. మీరు పర్మిషనిస్తే వస్తాను...."

ఆమె గుండెలు ఝల్లుమన్నాయ్. అతడి భావం పూర్తిగా అర్థంగాక విస్ఫారిత నేత్రాలతో చూసిందామె. తనని పెళ్లిచేసుకుంటానని తండ్రితో చెప్పడానికొస్తాడేమోనన్పించి మనసులోనే పొంగిపోయింది.

కలవరపడ్డాడతడు.

"ఐ మీన్..... మీ నాన్నగారి చిత్రాలవీ చూద్దామనీ.....ఆయన గురించి వినడమే గాని ఎన్నడూ ఆయన కుంచె విన్యాసాలు చూళ్ళేదు."

కొంచెం నిరుత్సాహపడింది. అది కన్పించకుండా దాచి చిర్నవ్వు చిలకరిస్తూ "దానికి నా పర్మిషన్ కావాలా చెప్పండి. మీ రెప్పుడైనా రావొచ్చు" అంది.

"అమ్మమ్మ. అలాగనకండి మరి. మీరు పర్మిషనివ్వగా రావటం వేరు నా అంతట నేను రావటం వేరు"

ఆమె మెదళ్ళో తళుక్కుమనేదో మెరిసింది. కొన్నాళ్ళక్రితం చూసిన ఓ సినిమాలో హీరోయిన్ని అచ్చం ఇలాగే అడుగుతాడు. ఆమె రమ్మంటుంది. అతడెళ్ళేసరికి ఇంట్లో ఆమె తప్ప ఎవరూ వుండరు. మేడా గార్డెనూ అన్నీ చూపిస్తుంది. మాటలు కలుస్తాయి. ఆ పిమ్మట మనసులు కలుస్తాయి.

"అయితే నేనే పిలుస్తున్నాను రండి"

"థాంక్యూ మేడమ్. థాంక్యూ సోమచ్"

* * *

టౌన్‌కో ప్రక్కనున్న మురికిపేటలోకి తలొంచుకుని వేగంగా అడుగులేస్తూ వెళ్ళి ఒకింటిముందాగి తలుపు తట్టాడు రాంబ్రహ్మం.

కాస్సేపటికొకావిడ ఆవులిస్తూ తలుపు తీసింది.

నలిగిన పువ్వులా వున్న ఆమెనీ ఆమెలో అదృశ్యమవుతోన్న సౌందర్యఛాయల్నీ చూస్తూ నిలబడ్డాడు.

"మీరా....రండి......"

పాత రేకు కుర్చీ వేసింది. కూర్చున్నాడు.

"నాలుగు పెయింటిగ్స్‌కి నువ్వు మోడల్‌గా ఉండాలి. కొంచెం న్యూడ్‌గా......"

తన చెవుల్ని నమ్మలేనట్టుగా చూసిందామె.

అతడి చాలా చిత్రాలకి మోడల్ గరల్‌గా పనిచేసిందామె. కానెప్పుడూ ఇలా అడగలేదు. తనకి తెలిసున్నంత వరకూ ఒక్క నగ్నచిత్రమూ గీయలేదు. అలాటిదిప్పుడు.......!

ప్రశ్నార్థకంగా చూసింది.

పిమ్మట చిన్నగా నిట్టూర్చింది.

తమ సరుక్కి డిమాండ్ లేనప్పుడు డిమాండ్ వున్న సరుకువైపు మరలక తప్పదు. చౌకబారు రుచుల కనుగుణంగా తననీ తన ప్రతిభనీ దిగజార్చక తప్పదు. కారణం అదే బ్రతుకు తెరువు గనుక - అతడికైనా తనకైనా తమలాంటి వారికైనా.

"మొత్తం రెండొందలిస్తాను"

"ఎప్పట్నుంచీ?"

"ఇవాల్టినుంచే. చాలా అర్జంటు"

అంగీకార సూచకంగా తలూపింది.

* * *

"హలో"

ప్రేమ నవల చదువుకోన్న లలిత తలెత్తి చూసింది.

భాస్కర్ నవ్వుతూ హీరోలా నిలబడివున్నాడు.

"మీరా. రండి రండి" లేచి ఆహ్వానించింది.

"కొంచెం పనిమీద ఇటు వెళ్తూంటే మీ ఆహ్వానం గుర్తొచ్చింది. కాలేజీకి శెలవు కదా ఇంట్లోనే వుంటారని వచ్చేను...."

జవాబుగా నవ్వి, ఇప్పుడే వస్తానన్చెప్పి లోపలికెళ్ళి రెండు కప్పుల్లో టీ పోసుకొచ్చింది.

"అద్భుతం కొన్ని క్షణాల్లో టీ తయారుచేశారన్నమాట"

"ఇప్పుడు చేసింది కాదులెండి. ఫ్లాస్కులో వుంది. మా నాన్నగారికోసం ఎప్పుడూ రెడీగా ఉంటుంది"

"అయితే మీ ఇంటికెప్పుడొచ్చినా నాకో కప్పు రెడీగా వుంటుందన్నమాట"

"అవునవును, కప్పు మాత్రం రెడీ" నవ్వింది సితార మీటినట్లు.

"భలేగా మాట్లాడతారే" అని నవ్వేశాడు.

"మీ ఇల్లెంతో ప్రశాంతంగా వుందండీ. ఎంతైనా కళాకారుల ఇల్లు కదూ?"

"అదేం కాదులెండి. మా అమ్మా వాళ్ళూ పెళ్ళికెళ్ళారు. నాన్నగారేదో పనిమీదెళ్ళారు"

"అలాగా. అయితే ఆయన అపూర్వసృష్టి చూసే భాగ్యం నాకు లేదన్నమాట" ఆశాభంగం పొందినట్లు మొఖంపెట్టాడు.

"నేను చూపిస్తాన్లెండి"

"థాంక్స్. రక్షించారు. ఇప్పుడేయే చిత్రాలు వేస్తున్నారు"

"మేడపైనున్న ఒక్క గదినీ నాన్నగారు స్టూడియోగా ఉపయోగించుకుంటూంటారు. అంచేత ఆయన ఏకాగ్రత దెబ్బ తింటుందని మేమెక్కువగా పైకెళ్ళం. ఈ మధ్య పది పదిహేను రోజుల్నుండి రాత్రీ పగలూ దీక్షగా గీస్తున్నారు. పెద్ద ఆర్డరొచ్చిందని అమ్మ చెప్పింది. పెద్ద పెయింటింగ్స్ అనుకుంటాను....."

"నేను చాలా లక్కీఫెలోనన్నమాట"

బదులుగా నవ్వి అతడ్ని మేడమీది గదిలోకి తీసుకెళ్ళింది.

రంగులు ఆరడానిగ్గాను గుమ్మానికెదురుగుండా ఉంచిన నిలువెత్తు చిత్రాన్ని చూసి తుళ్ళిపడ్డారిద్దరూ.

ఆ చిత్రంలో స్నానంచేసి నీళ్ళబిందెతో చెరువు నుంచి వస్తోందో సుందరి. తడిసిన పలుచని వలువల్లోంచి ఆమె ఒంపుసొంపులన్నీ ప్రస్ఫుటంగా కన్పిస్తూ కవ్విస్తున్నాయ్.

లలిత ముఖం ఎర్రబడ సాగింది. వెంటనే తల దించేసుకుంది.

భాస్కర్ చూపులు మాత్రం ఆ చిత్రానికి అతుక్కుపోయాయ్.

వెంటనే దాన్ని ప్రక్కకి త్రిప్పి పెట్టేసి మరో చిత్రం బయటకి తీసిందామె.

మరుక్షణం పాముని చూసినట్టు ఎగిరి వెనక్కి గంతేసింది.

ఎన్నడూలేంది తండ్రి ఇలాంటి చిత్రాలు గీయటం.....సరిగ్గా ఇప్పుడే అతడు రావటం.....

అంతా అయోమయంగా కంగారుగా వుందామెకి.

అతడా చిత్రాన్ని సమీపించాడు.

అదీ నిలువెత్తు చిత్రమే. మూడొంతులు నగ్నంగా వున్న ఓ యువతి మత్తుగా చూస్తూ మధుపాత్రనందిస్తోంది. ఉమర్ ఖయాం సాకి గుర్తొచ్చిందతడికి. అతడి నరాల్లో విద్యుత్తు ప్రాకుతున్నట్టు సంచలనం పుట్టింది.

"ఇంక వెళ్దామండి........" హీన స్వరంతో అంది.

అతడు చొరవగా ముందుకెళ్ళి గోడవేపు త్రిప్పివుంచిన ఇంకో చిత్రాన్ని వెనక్కి తిప్పాడు.

ఇద్దరూ షాక్ తిన్నారు.

అందులో ఓ నగ్నసుందరి పెద్ద బండమీద బోర్లా పడుకుంది. కళ్ళు మత్తుగా మూసుకుపోతున్నాయ్. లేత ఎండలో ఆమె శరీరం మెరుస్తోంది. ఆమె ఓ ప్రక్క అవయవాలూ ఒంపులూ స్పష్టంగా కన్పిస్తూ వెర్రెత్తిస్తున్నాయ్.

అతడి ముఖం అదోలా మారిపోయింది. కోరికలు వేయి నాల్కలు చాపి బుసలు కొడుతోంటే ఆ చిత్రాన్ని కళ్ళతో త్రాగేస్తూ ఆమె వంక చూశాడు.

ఆమె పరిస్థితీ అలాగే వుంది. గుండెల్లో వింత సంచలనం. శరీరపు అణువుల్లో చిత్రమైన అనుభూతి.

నాలుగో చిత్రం కూడా బహిర్గతం చేశాడు.

అందులో రెండు శరీరాలు-ఒక ఆడ ఒక మగది - నీడల్లా పెనవేసుకుపోతున్నాయ్....

అతడు మెల్లగా ఆమెని సమీపించాడు.

అతడి నిశ్వాసాల తాలూకు గాలి వేడిగా తగుల్తోందామెకి.

చెలరేగుతున్న కోరికల్తో దహించుకుపోతున్న ఇద్దరూ ఎదురెదురుగా నిలిచారు.

అమాంతం ఆమెని గాఢకౌగిల్లో బంధించేసి ఆమె పెదాలని చుంబించాడు.

ఆమె మెదడు ప్రతిఘటించమని హెచ్చరిస్తోంది. కానామె శరీరం అతడి కౌగిల్లో మైనపు బొమ్మలా కరిగిపోతోంది.

అతడామె అణువణువునీ తమకంగా స్పృశిస్తూ ఏదేదో చేయబోతోంటే తలుపు దగ్గర చప్పుడయ్యింది.

ఇద్దరూ ఉలిక్కిపడి మైకంలోంచి బయటపడుతూ చూశారు.

రాంబ్రహ్మం.

చిన్నగా అరిచి అతడ్ని త్రోసేసి కంగారుగా ఏడుస్తూ పారిపోయింది లలిత.

తప్పు చేసిన వాళ్ళా తలొంచుకుని ఓ క్షణం నిలబడి హఠాత్తుగా తన పరిస్థితి గుర్తు రాగా అతడి ప్రక్కనుంచి దూసుకుపోయాడు భాస్కర్.

పిచ్చిచూపులు చూస్తూ గదిలో అడుగుపెట్టిన రాంబ్రహ్మానికి కొన్నిరోజులుగా ఏకదీక్షగా చిత్రించిన నాలుగు చిత్రాలూ కన్పించాయ్.

కన్పించటమే కాదు వెకిలిగా హేళనగా నవ్వేయ్. కసిగా కక్షగా చూశాయ్. నగ్నంగా నర్తించాయ్.

వాటిని చూడలేక కళ్ళు మూసుకున్నాడు.

గుండెల్లో భళ్ళున పగిలిన పెద్ద అల తాలూకు నీళ్లు కన్నీళ్లుగా స్రవిస్తున్నాయ్.

చిత్రహింసలకి గురైనవాళ్ళా డీలాపడి చతికిలపడిపోయాడు.

మెదడు పశ్చాత్తాపంతో దహించుకుపోతోంది. గుండెల్నెవరో ఉక్కుహస్తాలతో నలిపేస్తున్నట్టుగా వుంది. శరీరాన్ని ముక్కముక్కలుగా నరుకుతున్నట్టు భావన కలుగుతోంది.

ఎంత తప్పు చేశాడు!

కుంచెకి పనిలేదని కుంచెనీ, రంగుల్నీ, కళనీ, ఆఖరికి నీతినీ క్షుద్రప్రయోజనాల కోసం బలి పెట్టడానికి సిద్ధపడ్డాడు.

అవును. తను గీచినవి మామూలు చిత్రాలు కావు.

మనిషికీ పశువుకీ తేడా లేకుండా చేసే చిత్రాలవి.

మనుషుల్లో ఇంగితజ్ఞానం చంపి నీతి పీక పిసికి రాక్షసుల్లా చెలరేగేలా చేసే చిత్రాలవి. మనుషుల్లో పశుకామాన్ని పుట్టించి ప్రళయం సృష్టించే చిత్రాలవి!

అవి ఒక్క త్రుటిలో రెండు లేత వయస్సుల్ని విషపూరితం చెయ్యగలిగినంత శక్తివంతమైనవి.

ఇక రేపు వాటిని బార్లో తగిలిస్తే? ఎందరెందరో చూస్తే?

లేదు. అలా జరగడానికి వీల్లేదు. తన కళ మనిషిని పశువుగా మార్చడానికి వీల్లేదు. నాగరికుడ్ని అనాగరికుడిగా ప్రవర్తించడానిక్కారణం కావడానికి వీల్లేదు.

కళని నమ్ముకున్న తను కళని నిర్దాక్షిణ్యంగా నీతిబాహ్యంగా ముక్కలుచేసి అమ్ముకుని హేయమైన నెత్తురుకూడు తినడు గాక తినడు?

మరికొన్ని నిమిషాలకి–

నాలుగు చిత్రాలు అగ్నికి ఆహుతి అవుతోంటే నిర్వికారంగా చూస్తూ కూర్చున్నాడు ఆర్టిస్ట్ రాంబ్రహ్మం.

**(యువ మాసపత్రిక జూన్ 1985)**